క్లుప్తంగా

ఘనంగా శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి

గుర్రంకొండ: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని మండలంలోని చెర్లోపల్లెలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం గ్రామంలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన సేవల్ని వక్తలు కొనియాడారు. ఈకార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు రెడ్డిముని నాయుడు, జిల్లా ఓబీసీమోర్చా ఉపాధ్యక్షులు రామాంజులు, జిల్లా సోషియల్ మీడియా కో-కన్వీనర్ భరత్, నాయకులు అన్నయ్యలు పాల్గొన్నారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

వాల్మీకిపురం: మండలంలోని బూడిదవేడు పంచాయతీ ఎగువబూడిదవేడు, దిగువ బూడిదవేడు, మస్యంవారిపల్లి గ్రామాల్లో శనివారం ఉదయం 6గంటల నుంచి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్ తెలిపారు. ఇందులో భాగంగా పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకొని, పరిష్కార సమస్యలను అక్కడిక్కడే పరిష్కరిస్తారని తెలిపారు. మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు హాజరుకావాలని వారు కోరారు.

కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీ



ఏఐఎస్‌ఎఫ్ నూతన కమిటీ

మదనపల్లె సిటీ: కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల పేరుతో దోపిడీ చేస్తున్నారని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్టీయూ భవన్‌లో ఏఐఎస్‌ఎఫ్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలల్లో అనేక రకాలుగా విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అక్రమంగా అధిక ఫీజులు వసూలు చేయడం సరికాదన్నారు. ఇలాంటి పాఠశాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం నియోజకవర్గ నూతన కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఓబులేసు, కార్యదర్శిగా మాధవ్ కుమార్, ఉపాధ్యక్షులుగా సంతోష్, గంగా, వినయ్, సహాయ కార్యదర్శులుగా సూరి, లూయిసా, భవిత, కోశాధికారిగా ప్రసన్నలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకులు క్రిష్టప్ప, కార్యదర్శి కోటేశ్వరరావు పాల్గొన్నారు.


250 లీటర్ల నాటుసారా స్వాధీనం



నిందితుల అరెస్ట్ చూపుతున్న ఎస్‌ఈబీ సీఐ శ్రీహరిరెడ్డి

మదనపల్లె : ఎస్‌ఈబీ అధికారులు శుక్రవారం మదనపల్లె మున్సిపాలిటీ పరిధిలోని ఇసుకనూతిపల్లె వద్ద జరిపిన తనిఖీల్లో అక్రమంగా ఆటోలో రవాణా చేస్తున్న 250 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని ఆరుగురిని అరెస్ట్‌చేసినట్లు సీఐ శ్రీహరిరెడ్డి తెలిపారు. నారమాకులతండాకు చెందిన ట్రాన్స్‌పోర్టర్ బాలాజీనాయక్(26), నాటుసారా తయారీదారుడు శంకర్‌రెడ్డినాయక్(38), మదనపల్లె మండలం చీకలగుట్టకు చెందిన నాటుసారా అమ్మకందారులు నాగార్జుననాయక్ (30), సురేష్‌నాయక్(41), రాజునాయక్‌ను అరెస్ట్‌చేసి 5 మూటల్లో తరలిస్తున్న సారా పాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. సారాను తరలిస్తున్న ఆటోను సీజ్‌చేసి ఆరుగురిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. తనిఖీల్లో ఎస్ఐ అంజాద్‌బాషా, ఎస్‌ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్ల తనిఖీ



స్కానింగ్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ఉషారాణి

పీలేరు రూరల్ : ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఆస్పత్రులలో స్కానింగ్ సెంటర్లు నిర్వహించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఉషారాణి అన్నారు. శుక్రవారం పీలేరు పట్టణంలోని శశి హాస్పిటల్, ఎస్‌కేఆర్, చిన్నారి, ప్రసాద్, సాయిలీలా ఆస్పత్రులు, స్టార్‌లైట్ డయాగ్నోస్టిక్స్ స్కానింగ్ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్కానింగ్ చేసి ఆడ,మగ చెప్పడం చట్టరీత్యా నేరమన్నారు. నెలవారి రిపోర్టులు సక్రమంగా పంపించాలని ఆదేశారు. కార్యక్రమంలో డెమో అధికారి దేవశిరోమణి, హెచ్‌ఈ ఉషారాణి, రాజగోపాల్, సూపర్‌వైజర్ వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పేదలకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

ఎమ్మెల్యే నవాజ్‌బాషా



ప్రభుత్వ పథకాల బుక్‌లెట్లను అందిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

నిమ్మనపల్లె : వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గత నాలుగేళ్లుగా నవరత్నాల పథకాలతో పాటు అనేక సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందిస్తూ పేదప్రజలకు అండగా నిలిచిందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. శుక్రవారం రెడ్డివారిపల్లె పంచాయతీ దివిటివారిపల్లె, శ్రీనివాసపురం, నాగప్పనాయునిబురుజు, గుండ్లబురుజు గ్రామాల్లో సర్పంచ్ నూతనకాల్వ రెడ్డెమ్మ, నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. సింగిల్‌విండో అధ్యక్షుడు రెడ్డిశేఖర్‌రెడ్డి, మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ ఆర్‌ఐ.రమణారెడ్డి, ఆర్బీకే చైర్మన్ ప్రవీణ్‌కుమార్ రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ రామమోహన్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు సమస్యలు తెలుపుతూ దివిటివారిపల్లె గ్రామానికి మదనపల్లె నుంచి బస్సు సర్వీసు కేవలం రెండుసార్లు మాత్రమే రావడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వ్యవసాయ ఉత్పత్తులు తీసుకెళ్లేందుకు, ప్రజలు మదనపల్లెకు వెళ్లేందుకు కష్టంగా ఉంటోందని విన్నవించారు. గ్రామంలో సిమెంట్‌రోడ్లు నిర్మించాలంటూ వినతిచేశారు. ఇంటినిర్మాణాలపై వెళుతున్న విద్యుత్‌తీగలను మార్చాలని అభ్యర్థించారు. గత ప్రభుత్వ హయాంలో ఇంటి నిర్మాణానికి ఒక రూపాయి అకౌంట్‌లో పడటం వల్ల ప్రస్తుతం తాము ఇల్లు మంజూరుకాక ఇబ్బందులు పడుతున్నట్లు కొంత మంది ఎమ్మెల్యే దృష్టికి సమస్యను తీసుకువచ్చారు. ప్రజలు తెలిపిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని, అధికారులను అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... జగనన్న అందిస్తున్న పథకాలతో ప్రతి కుటుంబం లబ్ధి పొందుతోందన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతినెలా 1వతేదీ ఉదయాన్నే తలుపుతట్టి పింఛనుదారులకు పెన్షన్ అందిస్తున్నారన్నారు. రైతుల సంక్షేమం కోసం రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు, పంటనష్టం బీమా, పెట్టుబడిసాయం చేస్తున్నారన్నారు. విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ పేదప్రజలకు మెరుగైన విద్య, వైద్యం అందేలా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచులు సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ విజయలక్ష్మి, వైస్ ఎంపీపీ జయప్రకాష్‌రెడ్డి, నాయకులు యుగంధర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, చంద్రమోహన్, విజయ్‌కుమార్‌రెడ్డి, తహసీల్దార్ సీ.ఆర్.మంజుల, ఎంపీడీఓ శేషగిరిరావు పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డులో జాక్‌పాట్, కమీషన్ నిషేధం

– ఏడీ త్యాగరాజు



మండీ యజమానుల సమావేశంలో మాట్లాడుతున్న ఏడీ త్యాగరాజు

మదనపల్లె : టమాట మార్కెట్‌యార్డులో రైతులు తీసుకువచ్చిన టమాటకు సంబంధించి జాక్‌పాట్, కమీషన్ తీసుకోవడం నిషేధమని, రైతులు దీనిపై రాతపూర్వకంగా ఫిర్యాదుచేస్తే వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని మార్కెటింగ్‌శాఖ ఏడీ త్యాగరాజు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక మార్కెట్‌కమిటీ కార్యాలయంలో వైస్‌చైర్మన్ జి.వెంకటరమణ, డైరెక్టర్ తట్టిశ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో వ్యాపారులు, మండీ యజమానులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏడీ త్యాగరాజు మాట్లాడుతూ...మార్కెటింగ్‌శాఖ నిబంధనల మేరకు మార్కెట్ యార్డుల్లో మండీ యజమానులు వలంటరీ ట్రేడింగ్ నిర్వహించాలన్నారు. రైతులు, ప్రజాసంఘాల నాయకులు కొందరు మార్కెట్లో కమీషన్ వసూలు చేస్తున్నారని, జాక్‌పాట్ తీసుకుంటున్నారని ఫిర్యాదు చేసిన నేపథ్యంలో క్షేత్రస్థాయిలో వేలం విధానాన్ని పరిశీలించామన్నారు. ఈ సందర్భంగా కొందరు వ్యాపారులు, మండీ యజమానులు రైతులు సరుకును పొలాల వద్దే గ్రేడింగ్ చేసుకుని తీసుకుని వస్తే మంచిధర ఇచ్చి కొనేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. నాణ్యమైన సరుకు వస్తే ఇతర ప్రాంతాలకు పంపేందుకు వీలుగా ఉండటమే కాకుండా ఆర్డర్‌లు అధికంగా వస్తాయన్నారు. గ్రేడింగ్ లేకపోవడంతో బయటి మార్కెట్లలో అమ్మకాలు జరగడం లేదన్నారు. దీంతో రైతులు స్వచ్ఛందంగా కొన్ని క్రేట్లను వ్యాపారులకు ఇచ్చి ధరలు పెంచుకుంటున్నారని చెప్పారన్నారు. అలాగే యార్డులో ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందిగా ఉందన్నారు. దీనిపై ఏడీ వివరణ ఇస్తూ.. జాక్‌పాట్ ఏ రూపంలో తీసుకున్నా తప్పేనని, ఈ విధానంలో వేలం నిర్వహిస్తే మండీ లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్ సమస్యపై పోలీసుశాఖతో సంప్రదించి పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. ప్రతిరోజు వేలం సమయంలో మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్లు దగ్గరుండి పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ సెక్రటరీ అభిలాష్, డైరెక్టర్ ప్యారేజాన్, మండీ యజమానుల అసోసియేషన్ నాయకులు నరసింహారెడ్డి, జయరామిరెడ్డి, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రిజర్వాయర్ బాధితులకు ఆర్‌అండ్‌ఆర్ కాలనీ

– ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



కాండ్లమడుగు వద్ద సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

బి.కొత్తకోట/ కురబలకోట: తంబళ్లపల్లె నియోజకవర్గ వరప్రసాదిని ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ భూ బాధితులకు అదిరిపోయేలా ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఆధ్వర్యంలో కురబలకోట మండలంలోని పిచ్చలవాండ్లపల్లె, బి. కొత్తకోట మండలం కాండ్ల మడుగు క్రాస్ వద్ద శుక్రవారం రైతులతో ముఖాముఖి నిఊహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూములు కోల్పోతున్న రైతులు నచ్చి మెచ్చేలా పరిహారం, ఆపై పునరావాసం ఉంటుందన్నారు. ఎవ్వరూ బాధపడకుండా నష్టపరిహారం, ఆర్ అండ్ కాలనీ నిర్మించడం జరుగుతుందన్నారు. భూములిచ్చిన రైతుల త్యాగాన్ని ఎప్పటికీ మరువలేరన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రిజర్వాయర్‌కు ముదివేడు, పిచ్చలవాండ్లపల్లె, కోటావూరు, కురబలకోట గ్రామాల రైతుల భూములు 1075.81 ఎకరాలు పోతున్నాయన్నారు. భూ బాధితులలో కురబలకోట మండలానికి చెందిన వారికి ముదివేడు దగ్గరున్న ఎంబీజీ లే అవుట్ పక్కన 30 ఎకరాల్లో బ్రహ్మాండమైన ఆర్ అండ్ ఆర్ కాలనీ ఏర్పాటు చేస్తారన్నారు. బి.కొత్త మండలానికి చెందిన వారికి కాండ్లమడుగు క్రాస్ వద్ద ఏర్పాటు చేస్తారన్నారు. గుడి, బడి, తాగునీరు, మురికినీటి కాలువలు, ఆసపత్రి, పశువుల ఆసుపత్రి, కమ్యూనిటీ హాల్, విశాలమైన రోడ్లు, సచివాలయం , ఏటీఎంతో పాటు సకల సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రతి బాధితుడికి ఐదు సెంట్లు ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు పక్కా ఇళ్ళు కట్టించడం జరుగుతుందన్నారు. సొంతంగా కూడా కట్టుకోవచ్చన్నారు. లేదంటే ఓటీఎస్ కింద రూ. 8. 60 లక్షలు ఇవ్వడం జరుగుతుందన్నారు ఎస్సీ, ఎస్టీలకు అదనంగా మరో రూ. 50 వేలు ఇస్తారన్నారు. బాధిత రైతులకు సంతృప్తికరంగా పునరావాసం ఉంటుందన్నారు. ఆర్డీఓ మురళి, హెచ్‌ఎన్ఎస్ పీలేరు యూనిట్–2 స్పెషల్ ఆఫీసర్ గోపాల కృష్ణ, తహశీల్దారు మల్లంపల్లె భీమేశ్వరరావు, ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

పెద్దమండ్యం: మండలంలోని బండ్రేవు గ్రామ సచివాలయ పరిధిలోని దిగువపల్లె, మందలవారిపల్లె గ్రామాలలో శనివారం తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పర్యటించనున్నట్లు ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక, ఎంపీడీఓ శ్రీధర్‌రావు తెలిపారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రెండు గ్రామ పంచాయతీల పరిధిలోని ప్రతి పల్లెలో ఇంటింటికి ఎమ్మెల్యే వెళ్లి ప్రజలను తెలుసుకొని పరిష్కరిస్తారని చెప్పారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, ఆయా గ్రామాల పరిధిలోని అధికారులు హాజరుకావాలని వారు కోరారు.

పోస్టర్ల ఆవిష్కరణ

పెద్దతిప్పసముద్రం: కై వారం శ్రీ యోగి నారేయణ మఠంలో నిర్వహించే గురుపూజ–సంగీతోత్సవ కార్యక్రమం పోస్టర్లను శుక్రవారం ఎమ్మెల్యే పెద్దరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. వచ్చే నెల 1 నుంచి మూడవ తేది వరకు కైవారం ఆలయ ధర్మాధికారి ఎంఆర్.జయరాం సారథ్యంలో వానరాసి బాలక్రిష్ణప్ప పర్యవేక్షణలో నిర్వహించే ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆలయ భజన బృందాల ఆంధ్ర సమన్వయకర్త కేవీ రమణ కోరారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలి

మదనపల్లె సిటీ: విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలని జెఎన్‌టీయూఏ ప్రిన్సిపాల్ ఎస్.వెంకటసత్యనారాయణ అన్నారు. శుక్రవారం చిత్తూరు రోడ్డులోని ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీలో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇన్నోవేషన్ అండ్ ఇన్వెన్షన్‌కు చాలా తేడా ఉందన్నారు. ఏఐఎంఎల్‌కు మంచి భవిష్యతుత ఉంటుందని తెలిపారు. విద్యార్థులు ఇలాంటి కాన్ఫరెన్స్ సమావేశాల్లో పాల్గొని వారి నైపుణ్యాన్ని పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ ఎస్.రామలింగారెడ్డి, ప్రిన్సిపల్ సతీష్‌బాబు, ప్రోగ్రాం కన్వీనర్ జగన్,కో ఆర్డినేటర్లు గంగాధర్‌రెడ్డి, లలిత తదితరులు పాల్గొన్నారు. పలు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు పంపిన పరిశోధన పత్రాలను సమర్పించారు.

ప్రతి ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి

కలకడ : మారుతున్న పాఠ్యాంశాలకు అనుగుణంగా ప్రతి ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థిగా తర్ఫీదు పొంది విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించాలని కలకడ క్లస్టర్ ప్రధానోపాధ్యాయురాలు సరస్వతిరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సన్మానించి ఘనంగా వీడ్కోలు పలికారు. కలకడ జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో సుదీర్ఘకాలం విధులు నిర్వహించి పాఠశాల , విద్యాభివృద్ధిలో పాలుపంచుకున్న ఉపాధ్యాయులు రాజయ్యనాయుడు, నాగరాణి, ఆంజినేయులు ఇతర పాఠశాలలకు బదిలీపై వెళ్ళగా కె.బాటవారిపల్లె ఉన్నతపాఠశాల ఉపాధ్యాయ బృందం వారికి ఆత్మీయ వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల తనిఖీ

రామసముద్రం: మండలంలోని ఆర్.నడింపల్లె పంచాయతీ, ఎలవానెల్లూరు పంచాయతీలలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను శుక్రవారం ఏపీడీ మధుబాబు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీలో ఎలాంటి అవకతవకలు జరిగిన సహించేది లేదని , ప్రతి పంచాయతీలోనూ ఉపాధిహామీ కూలీల సంఖ్యను పెంచాలని సూచించారు.

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి

– డీఎస్పీ కేశప్ప



మాట్లాడుతున్న డీఎస్పీ కేశప్ప

మదనపల్లె : బక్రీద్‌ను ముస్లిం సోదరులు ప్రశాంతవాతావరణంలో సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని డీఎస్పీ కేశప్ప అన్నారు. జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు ఆదేశాల మేరకు స్థానిక డీఎస్పీ కార్యాలయంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన శాంతికమిటీ సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. మదనపల్లె పట్టణం పరమత సహనానికి ప్రతిరూపమని, విశిష్టత కలిగిన బక్రీద్‌ను మతపెద్దల సూచనలతో సంతోషంగా జరుపుకోవాలన్నారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే తమదృష్టికి తేవాలని, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటుచేస్తున్నామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖకు అందరూ సహకరించాలని కోరారు. సమావేశానికి హాజరైన మత పెద్దలు తమవంతు సహకారం అందిస్తామని డీఎస్పీకి తెలిపారు. కార్యక్రమంలో సీఐలు మహబూబ్‌బాషా, మురళీకృష్ణ, సత్యనారాయణ, ఎస్ఐలు సుబ్బారెడ్డి, హరిహర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

పెద్దతిప్పసముద్రం: ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎస్ఏ.కరీముల్లా అన్నారు. శుక్రవారం మండలంలోని కందుకూరు, పెద్దతిప్పసముద్రం గ్రామాల్లోని మైనారిటీలతో జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ 'హర్ దిల్‌మే వైఎస్సార్–హమ్ సబ్ జగన్‌కే సాత్' పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ మైనారిటీల సమస్యలను పరిష్కరించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ముస్లింల సమస్యలను ఆయా నియోజకవర్గ, పార్లమెంటు పరిధిలోని ఎంపీ, ఎమ్మెల్యేల సహకారంతో పరిష్కరించనున్నట్లు తెలిపారు. అనంతరం ఆయనను ముస్లిం సోదరులు, మత పెద్దలు ఘనంగా సన్మానించారు. ఎంపీపీ మహమూద్, సర్పంచ్ రహ్మతుల్లా, మాజీ సర్పంచ్ రియాసత్ అలీఖాన్ తదితరులు ఉన్నారు.

అభాగ్యురాలి చదువుకు ఎమ్మెల్యే భరోసా

బి.కొత్తకోట: తల్లిదండ్రులు లేని ఓ అభాగ్యురాలి జీవితంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి వెలుగు నింపారు. వివరాలలోకి వెళితే..ఎమ్మెల్యే శుక్రవారం బి.కొత్తకోట మండలంలోని కోటావూరు సచివాలయ పరిధిలో గడప గడపకు ఎమ్మెల్యే కార్యక్రమం నిర్వహించారు. సమస్యలు వింటూ, పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్న ఆయనకు గుండ్లగుట్టవారిపల్లెలో నిరుపేద కుటుంబం వేదన బయటపడింది. సురేంద్ర అతని భార్య ఇద్దరూ ఒకరి తర్వాత ఒకరు మరణించారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. మొదటి కుమార్తె పవిత్ర ఇంటర్ మీడియట్ బైపీసీ చదివి ఆర్థిక స్థోమత లేక ఇంటిదగ్గరే ఉండిపోయింది. గడప గడపకు కార్యక్రమంలో ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పెద్ద మనసుతో వారిని అక్కున చేర్చుకున్నారు. తానున్నానంటూ వారికి ధైర్యం చెప్పారు. అంతేకాదు మదనపల్లె లోని కృష్ణ చైతన్య కళాశాల యాజమాన్యంతో అక్కడికక్కడే ఫోన్ ద్వారా మాట్లాడారు. పవిత్ర చదువు పూర్తయ్యేదాకా మొత్తం ఖర్చు తానే భరిస్తానని చెప్పారు. ఆ కుటుంబానికి భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యేకి వారు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వివిధ గ్రామాల్లో సమస్యల పరిష్కారం కోసం ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజలకు సంతృప్తికరమైన సేవలు అందించాలన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి సీఎం జగనన్న ఆదరించాలని కోరారు.

సారా, కర్ణాటక మద్యం ధ్వంసం



కర్ణాటక మద్యాన్ని ట్రాక్టర్‌తో ధ్వంసం చేయిస్తున్న ఎస్‌ఈబీ అధికారులు

మదనపల్లె : మదనపల్లె ఎస్‌ఈబీ స్టేషన్ పరిధిలో గతంలో పట్టుబడిన రూ.9.80 లక్షల విలువచేసే నాటుసారా, కర్ణాటక మద్యంను ఎస్‌ఈబీ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాయచోటి ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ సమక్షంలో ధ్వంసం చేసినట్లు సీఐ శ్రీహరిరెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని చిప్పిలి విజయాడెయిరీ వెనుక హెలిప్యాడ్ వద్ద 85 కేసులకు సంబంధించి సుమారు రూ.2.80 లక్షలు విలువచేసే 2,800 లీటర్ల నాటుసారా, 81 కేసులకు సంబంధించి రూ.7లక్షల విలువైన 1,842 లీటర్ల కర్నాటకకు చెందిన నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్(ఎన్‌డీపీఎల్) మద్యాన్ని ట్రాక్టర్ సహాయంతో తొక్కించి నాశనం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌ఈబీ ఎస్ఐ అంజాద్‌బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

భూ ఆక్రమణపై దళితుల నిరసన



నిరసన తెలుపుతున్న బాధితులతో మాట్లాడుతున్న తహసీల్దార్ ఖాజాబీ

గుర్రంకొండ: దళితుల భూమి ఆక్రమించుకొన్నారని ఆరోపిస్తూ దళిత పోరాట హక్కుల సమితి ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద చేరుకొన్నవారు అక్కడే తమ నిరసన ప్రదర్శించారు.ఈసందర్భంగా బాధితుడు కదిరయ్య మాట్లాడుతూ 1981లో మాతండ్రికి గుర్రంకొండ పంచాయతీలోని సర్వేనెంబరు 522లో 1.04 ఎకరాల ప్రభుత్వ భూమి ఇచ్చారన్నారు. అయితే గ్రామానికి చెందిన రహంతుల్లా అనే వ్యక్తి తమ భూమిని ఆక్రమించుకొన్నట్లు ఆరోపించారు. తన తండ్రి పేరుమీద ఉన్న భూమిని తమకు స్వాధీనం చేయాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ ఖాజాబీ అక్కడికి చేరుకొని రెవెన్యూ రికార్డుల్లో రంగయ్య పేరుమీద భూమి ఉందన్నారు. వెంటనే ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసి పూర్తి స్థాయిలో విచారణ జరిపిస్తామన్నారు.

క్షయవ్యాధి గ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న దృశ్యం

పీలేరు రూరల్ : స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఏడు మంది క్షయవ్యాధి గ్రస్తులకు శుక్రవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ చేతుల మీదుగా నాలుగో విడత పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీబీ వ్యాధిగ్రస్తులకు మంచి పోషకాహారం అందివ్వడం వల్ల తొందరగా కోలుకుంటారని తెలిపారు. సమాజంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా ఒక టీబీ వ్యాధి గ్రస్తున్ని దత్తత తీసుకోవాలని కోరారు. శుక్రవారం పోషకాహారం వితరణ చేసిన దాతలు డాక్టర్ కరీముల్లా, డాక్టర్ అరుణ, లావణ్య, వివేకావతి, వసంత, కీర్తన, షాహీనలను అభినందించారు. ఈ కార్యక్రమంలో టీబీ యూనిట్ వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌నాయక్, సూపర్‌వైజర్స్ పవన్‌కుమార్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా 'జగనన్న సురక్ష'



కార్యదర్శులకు సూచనలిస్తున్న ఎంపీడీఓ గిరిధర్‌రెడ్డి

పెద్దతిప్పసముద్రం: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పారదర్శకంగా చేపట్టాలని ఎంపీడీఓ గిరిధర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ సచివాలయ పరిధిలో ఏ ఒక్క ఇల్లు వదలకుండా సందర్శించాలన్నారు. వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళుతున్నారా అనే విషయంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారన్నారు. కార్యక్రమం విధి, విధానాలపై వలంటీర్లకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. అర్హులై సంక్షేమ పథకాలు అందకుంటే సమగ్రంగా వివరాలను నమోదు చేసుకునేలా చూడాలన్నారు. ప్రతి ఇంటింటికీ వెళ్ళినప్పుడు ఓపికతో లబ్ధిదారుల సమస్య విని వాటిని పరిష్కారంపై దృష్టి సారించాలని ఎంపీడీవో సూచించారు.

'జగనన్న సురక్ష' పక్కాగా అమలు చేయాలి

కలికిరి: ప్రభుత్వ లక్ష్యం మేరకు జగనన్న సురక్ష పక్కాగా అమలు జరగాలని ఎంపీడీఓ గంగయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న సురక్ష పథకం ప్రారంభం సందర్భంగా సీఎం జగన్ మోహన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ గంగయ్య మాట్లాడుతూ జగనన్న సురక్ష అమలుకు ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ నూర్జహాన్, మండల ప్రత్యేక ఆహ్వానితులు రత్నశేఖర్ రెడ్డి, మండల కో–ఆప్షన్ సభ్యుడు రిజ్వానుల్లా, వైస్ ఎంపీపీ శ్రీకాంత్, సర్పంచ్‌లు నాగవేణి, అరుణకుమారి, గంగయ్య, సచివాలయాల మండల కన్వీనర్ రెడ్డెప్ప, ఎంపీటీసీ సభ్యులు షాహీన, అల్లాబక్షు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తీర్చడానికే ..

పెద్దమండ్యం: ప్రతి గడపలోని సమస్యను తీర్చడానికే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు పెద్దమండ్యం గ్రామ సర్పంచ్ ఎస్.బాబా అన్నారు. గ్రామ సచివాలయంలో శుక్రవారం వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రతి వలంటీర్ తన పరిధిలో ఉన్న కుటుంబాల్లో నెలకొన్న సమస్యలు, అర్హత ఉండి ఏవైనా ప్రభుత్వ పథకాలు అందని వారు, వివిధ రకాల సర్టిఫికెట్‌లు కావాల్సిన వారి వివరాలు సేకరించాలన్నారు. మండల స్థాయి అధికారుల బృందం వాటిని సకాలంలో పరిష్కరించి, అర్హులైన వారికి పథకాలు అందించేందుకు చర్యలు తీసుకుంటారని అన్నారు. కార్యక్రమంలో సచివాలయాల మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, కార్యదర్శి జగన్‌మోహన, కొ ఆప్షన్ మెంబర్ ఖాదర్‌వలి, సచివాలయ సిబ్బంది, వలంటీర్‌లు తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలతో గడప గడపలో సంతోషం



ప్రజలతో మాట్లాడుతున్న జి.వి. రాకేష్‌రెడ్డి

పీలేరు : రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి నవరత్నాల పథకాలతో గడప గడపలో సంతోషం నింపారని యువ పారిశ్రామిక వెత్త, వైఎస్సార్‌సీపీ నాయకులు జి.వి. రాకేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పీలేరు పట్టణంలోని తిరుపతి రోడ్డు, బండ్లవంక, కోటపల్లె రోడ్డు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి వివరించారు. అలాగే ప్రజా సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఇంకా అర్హత ఉండి పథకాలు అందకుండా ఉంటే తమదృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా బలోపేతం కావడమే లక్ష్యంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో నరసింహారెడ్డి, హుమయూన్, మల్లికార్జునరెడ్డి, కృష్ణారెడ్డి, మహితా ఆనంద్, నరేష్, ఉదయ్, ఎం.ఎస్.ఆర్. మదనమోహన్‌రెడ్డి, గుర్రం సురేంద్రరెడ్డి, నరేంద్రరెడ్డి, శ్రీనాథరెడ్డి, నాగభూషణం, మునీర్, సపూర, సదాశివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బలిబండి కార్యక్రమం

కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్టలో నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞంలో భాగంగా శుక్రవారం బలిబండి కార్యక్రమం ఆకట్టుకుంది. మహాభారతంలో బకాసురునికి భోజనం పెట్టడానికి భీముడు వివిధ రకాల వంటకాలు సేకరించే ఘట్టం నిర్వహించారు. భీముని వేషధారి ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌లో ఊరేగింపుగా వెళ్లారు. మంగళవాయిద్యాలతో గ్రామాల్లో పూజలు నిర్వహించారు. భక్తులు వంటకాలు బలిబండికి అందించారు. అనంతరం మహాభారత యజ్ఞం వద్దకు బలిబండి చేరుకుని సేకరించిన వంటకాలు భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు. పగలు భాగవతారిణి జి. గీతావాణి బకాసురవధ ఘట్టంపై ఆలపించిన హరికథాగానం ఆకట్టుకుంది. గజ్జెల శీన్‌రెడ్డి, జెడ్పీటీసీ గజ్జెల శృతి, సర్పంచ్ రమణమ్మ, ఉప సర్పంచ్ వేణుగోపాల్, గ్రామస్తులు పాల్గొన్నారు.